సాక్షి
కర్నూలు
ఆదివారం । 17 । మార్చి । 2024



వైభవం.. జయంత్యుత్సవం
శ్రీ రాఘవేంద్ర స్వామి జయంత్యుత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను స్వామి వారికి సమర్పించారు. 8లో▸



1,219 కేసుల పరిష్కారం
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,219 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. 8లో▸



అలరించిన సంప్రదాయ నృత్యం
శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిత్యకళావేదికపై విశాఖపట్నంకు చెందిన సాయి సురేఖ డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

బీసీ కార్పొరేషన్ ఈడీగా జాకీర్ హుస్సేన్



కర్నూలు(అర్బన్): జిల్లా వెనుకబడిన తరగతుల ఆర్థిక సేవా సహకార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్ జాకీర్‌హుస్సేన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో బీసీ కార్పొరేషన్ ఈడీగా విధులు నిర్వహించిన బీ నాగేశ్వరరావు ఈ ఏడాది జనవరి 31న పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో బీసీ సంక్షేమ సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ ఇప్పటి వరకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. కాగా.. కార్యాలయంలో ఏఈఓగా విధులు నిర్వహిస్తున్న జాకీర్‌హుస్సేన్‌కు ప్రభుత్వం ఈడీగా పదోన్నతి కల్పిస్తూ ఇక్కడకే పోస్టింగ్ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే ఆయన శనివారం ఉమ్మడి జిల్లాల కలెక్టర్లను కలిసి ఈడీగా బాధ్యతలు స్వీకరించారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బదిలీ

- ఇన్‌చార్జ్‌గా జే రంగలక్ష్మిదేవి

కర్నూలు(అర్బన్): జిల్లా షెడ్యూల్డు కులాల సేవా ఆర్థిక సహకార సంస్థ ఈడీగా విధులు నిర్వహిస్తున్న ఎస్ శ్రీనివాసకుమార్‌ను ప్రభుత్వం ఈ నెల 15న బదిలీ చేసింది. ఇందుకు సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి కాటి హర్షవర్ధన్ జీఓఆర్‌టీ నెంబర్‌ఐ 72ను జారీ చేశారు. శ్రీనివాసకుమార్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తు వచ్చారు. బదిలీ ఉత్తర్వుల దృష్ట్యా ఆయన రెండు బాధ్యతల నుంచి శుక్రవారం రాత్రి రిలీవ్ అయ్యారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఆదేశాల మేరకు సాంఘిక సంక్షేమ శాఖ జేడీగా విధులు నిర్వహిస్తున్న జే రంగలక్ష్మిదేవి ఎఎస్సీ కార్పొరేషన్ ఈడీ, డీటీడబ్ల్యూఓగా ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించారు.

నోడల్ అధికారిగా పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) పీఎల్ వరలక్ష్మిని కర్నూలు పార్లమెంట్ స్థానానికి సింగిల్ విండో పర్మిషన్ సెల్, క్యాండిడేట్ లైజనింగ్ సెల్‌కు నోడల్ అధికారిగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంది. ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు, లౌడ్ స్పీకర్లు తదితర వాటికి అనుమతులు తప్పనిసరి. ఇటువంటి వాటి కోసం రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సింగిల్ విండో పర్మిషన్ సెల్, క్యాండిడేట్ లైజనింగ్ సెల్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. దరఖాస్తులను నోడల్ అధికారి పీఎల్ వరలక్ష్మి పరిశీలించి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారికి పంపుతారు. కలెక్టర్ ఆమోదం తర్వాతనే ర్యాలీలు, ఊరేగింపులు, సభలు నిర్వహించాల్సి ఉంది.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌దే భవిష్యత్తు

- ఆర్‌యూ వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌యూ వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు కల్చరల్: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌దే భవిష్యత్తు అని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. శనివారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎడునెట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెక్ సాక్ష్యం ప్రోగ్రాం ప్రాంతీయ సదస్సును ఆర్‌యూలో నిర్వహించారు. బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి మైక్రో సాఫ్ట్, షాప్ సంస్థలు సహాయ సహకారాలు అందించాయి. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ క్లౌడ్ కంప్యూటింగ్ సామాజిక సమస్యల పరిష్కారానికి దోహద పడుతుందన్నారు. సదస్సులో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌యూసీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ హరి ప్రసాద్‌రెడ్డి, ఎడునెట్ ఫౌండేషన్ అసోసియేట్ డైరెక్టర్ సందీప్ కౌర్, షాప్ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ ముజమ్మిల్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేట్ మేనేజర్ పృథ్వీ పాల్గొన్నారు.

మేము.. సిద్ధం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించిన వైఎస్సార్‌సీపీ

- ఆలూరు, ఎమ్మిగనూరులో బీసీ, కర్నూలులో మైనార్టీ అభ్యర్థులకు టిక్కెట్లు
- ఈ దఫా ఎన్నికల్లో నలుగురు కొత్త ముఖాలు.. కర్నూలు బరిలో ఐఏఎస్ అధికారి
- కర్నూలు ఎంపీ అభ్యర్థిగా బీవై రామయ్య, నంద్యాలకు పోచా
- సామాజిక న్యాయం పాటిస్తూ అభ్యర్థుల ప్రకటన
- గత ఎన్నికల్లో 2 ఎంపీ, 14 అసెంబ్లీ స్థానాలను గెలిచిన వైఎస్సార్‌సీపీ
- తాజా ఎన్నికల్లోనూ ఫలితాలు పునరావృతమనే చర్చ



సాక్షి ప్రతినిధి కర్నూలు: సార్వత్రిక ఎన్నికల సమరం మొదలైంది. ఓ వైపు కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తే, మరో వైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ అభ్యర్థులను ఎంపిక చేసింది. మొత్తం 14 అసెంబ్లీ స్థానాల్లో రెండు బీసీ, రెండు ఎస్సీతో పాటు ఓ మైనార్టీ అభ్యర్థికి టిక్కెట్లు ఖరారు చేసింది. ఇందులో 8 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మరో అవకాశం దక్కింది. తక్కిన వాటిలో 4 స్థానాల్లో కొత్త ముఖాలకు చోటు కల్పించారు. ఎమ్మిగనూరు నుంచి మాజీ ఎంపీ బుట్టారేణుక బరిలో నిలుస్తున్నారు. అలాగే పార్లమెంట్ స్థానాల్లో కర్నూలు బీసీకి, నంద్యాల ఓసీకి కేటాయించింది.

బీసీలకు ప్రాధాన్యత

గత సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో ఒక బీసీకి మాత్రమే ఎమ్మెల్యే సీటు ఇస్తే ఈ దఫా ఎన్నికల్లో 3 సీట్లు కేటాయించింది. ఆలూరు నుంచి బోయ సామాజిక వర్గానికి చెందిన విరూపాక్షికి, ఎమ్మిగనూరులో మాజీ ఎంపీ చేనేత మహిళ బుట్టా రేణుకకు టిక్కెట్ దక్కింది. కర్నూలు నుంచి మైనార్టీ అభ్యర్థి ఇంతియాజ్‌ను బరిలో నిలిపింది. ఈయన కూడా మైనార్టీ బీసీ అభ్యర్థిగా బరిలో నిలవనున్నారు. అలాగే కోడుమూరు, నందికొట్కూరు నుంచి ఎస్సీ అభ్యర్థులు డాక్టర్ ఆదిమూలపు సతీష్, డాక్టర్ సుధీర్‌లు పోటీ చేయనున్నారు. వీరిలో విరూపాక్షి, సతీష్, సుధీర్, ఇంతియాజ్ తొలిసారి అసెంబ్లీ బరిలో నిలుస్తున్నారు. వీరిలో ఇంతియాజ్ ఐఏఎస్ అధికారి. ఇటీవల తన ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయ ప్రవేశం చేశారు. అలాగే రెండు ఎంపీ స్థానాల్లో నంద్యాల నుంచి సిట్టింగ్ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి మరోసారి సీటు దక్కించుకున్నారు. కర్నూలు ఎంపీ అభ్యర్థిగా నగర మేయర్ బీవై రామయ్య పోటీ చేస్తున్నారు.

వాల్మీకులు, కురుబలకు ప్రాధాన్యత

జిల్లాలో బీసీ సామాజికవర్గంలో అత్యధికంగా ఉన్న వాల్మీకులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యత ఇచ్చింది.

- ఆలూరు అసెంబ్లీ స్థానంతో పాటు, కర్నూలు ఎంపీ స్థానం నుంచి వాల్మీకులను బరిలోకి దింపింది.
- ఇప్పటికే ఆదోనికి చెందిన వాల్మీకి నేత మధుసూదన్‌ను ఎమ్మెల్సీగా ఎంపిక చేసింది.
- గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కూడా సుభాష్‌చంద్రబోస్ కొనసాగుతున్నారు.
- అలాగే వాల్మీకుల తర్వాత అత్యంత ఎక్కువగా ఉన్న కురబలకు కూడా న్యాయం చేసింది.
- పొరుగున ఉన్న అనంతపురం జిల్లాలో హిందూపురం, పెనుకొండ అసెంబ్లీలతో పాటు అనంతపురం పార్లమెంట్ స్థానాన్ని కూడా కురుబలకు కేటాయించింది.
- అలాగే కర్నూలు జిల్లాలో మేయర్‌గా ఉంటూ ఎంపీ సీటు దక్కించుకున్న రామయ్య స్థానంలో కురబ నేత సిట్రా సత్యనారాయణమ్మను మేయర్‌గా పార్టీ ప్రకటించింది.
- బోయ, వాల్మీకి వర్గాలు అనంతపురం, కర్నూలు జిల్లాలో ప్రాధాన్యత వర్గాలుగా ఉన్నాయి. ఈక్రమంలో రెండు ఉమ్మడి జిల్లాల్లో ఈ వర్గాలకు పార్టీ అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సీట్లు కేటాయించింది.
- రాష్ట్ర చరిత్రలో వాల్మీకి, కురుబలకు ఈ స్థాయిలో అసెంబ్లీ, ఎంపీ స్థానాలను కేటాయించిన తొలి పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే.
- ప్రస్తుతం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కూడా బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి ఈ వర్గాలకు ఈ స్థాయిలో సీట్లు కేటాయించలేదు.

ఒక్కడిని ఢీకొట్టేందుకు మూడు కూటములు

కర్నూలు జిల్లాలో టీడీపీ అత్యంత బలహీనమైన పార్టీ. 2014లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా కేవలం 3 అసెంబ్లీ సీట్లు మాత్రమే గెలుపొందింది. రెండు పార్లమెంట్ స్థానాల్లో ఓడిపోయింది. 2019లో టీడీపీ ఉనికి లేకుండాపోయింది. గత ఎన్నికల్లో జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 56.82 శాతం ఓట్లు నమోదైతే, టీడీపీకి కేవలం 35.55 , జనసేనకు 1.87శాతం, కాంగ్రెస్‌కు 1.47 శాతం ఓట్లు పోలయ్యాయి. అంటే టీడీపీకి, వైఎస్సార్‌సీపీకి 21.27 శాతం ఓట్లు తేడా ఉంది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఢీకొట్టేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పడ్డాయి. టీడీపీ, జనసేన కలిసినా 37.42శాతం మాత్రమే ఓట్లు ఉన్నాయి. బీజేపీ ఓటు బ్యాంకు ఒక్క శాతం లోపే. ఈ మూడు పార్టీలకు కలిసి 38.42 శాతం మాత్రమే ఓట్లు పోలయ్యాయి. మూడూ కలిసినా 18.4శాతం ఓట్లు వైఎస్సార్‌సీపీకి ఎక్కువగా ఉన్నట్లు అర్థమవుతోంది. పైగా గత ఎన్నికలతో పోలిస్తే నవరత్నాల అమలుతో సంక్షేమం, అభివృద్ధి, గ్రామస్థాయిలో సచివాలయాలు, ఆర్బీకేలు, పీహెచ్‌లతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు, పాలనలో తీసుకొచ్చిన సంస్కరణలతో ఓటు బ్యాంకు మరింత పెరిగింది. దీంతో గత ఎన్నికలతో పోలిస్తే మరింత ఓటు బ్యాంకుతో వైఎస్సార్‌సీపీ మళ్లీ క్లీన్‌స్వీప్ చేస్తుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

కర్నూలు జిల్లా అభ్యర్థులు



పూర్తి పేరు: అల్లుగుండు మహమ్మద్ ఇంతియాజ్
ప్రస్తుత హోదా: రిటైర్డు ఐఏఎస్
విద్యార్హత: బీటెక్ ఎన్ఐటీ (వరంగల్)
పుట్టిన తేది: 1.6.1965
సామాజిక వర్గం: ముస్లిం మైనార్టీ
నియోజకవర్గం: కర్నూలు



పూర్తి పేరు: డాక్టర్ ఆదిమూలపు సతీష్
ప్రస్తుత హోదా: వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
విద్యార్హత: ఎంబీబీఎస్, ఎంఎస్ ఆప్తాల్
పుట్టిన తేది: 15.06.1968
సామాజిక వర్గం: ఎస్సీ (మాదిగ)
నియోజకవర్గం: కోడుమూరు



పూర్తి పేరు: బుట్టా రేణుక
ప్రస్తుత హోదా: వైఎస్ఆర్ కాంగ్రెస్ ఎమ్మిగనూరు సమన్వయకర్త, మాజీ ఎంపీ
విద్యార్హత: డిగ్రీ పుట్టిన తేది: 21.6.1971
సామాజిక వర్గం: బీసీ (కుర్ని) నియోజకవర్గం: ఎమ్మిగనూరు



పూర్తి పేరు: బోయ ఎల్లా రామయ్య
ప్రస్తుత హోదా: కర్నూలు నగర మేయర్
విద్యార్హత: బీఈ, ఎల్ఎల్ఎం
పుట్టిన తేది: 25.05.1965
సామాజిక వర్గం: బోయ
పార్లమెంట్ నియోజకవర్గం: కర్నూలు



పూర్తి పేరు: యల్లారెడ్డి సాయిప్రసాద్‌రెడ్డి
ప్రస్తుత హోదా: ఆదోని శాసనసభ్యులు
విద్యార్హత: ఎస్ఎస్‌సీ
పుట్టిన తేది: 23.03.1963
సామాజిక వర్గం: రెడ్డి
నియోజకవర్గం: ఆదోని



పూర్తి పేరు: బుసినే విరూపాక్షి
ప్రస్తుత హోదా: జెడ్పీటీసీ సభ్యుడు, చిప్పగిరి మండలం
విద్యార్హత: డిగ్రీ
పుట్టిన తేది: 4.3.1969
సామాజిక వర్గం: బోయ
నియోజకవర్గం: ఆలూరు

పూర్తి పేరు: కంగాటి శ్రీదేవి
ప్రస్తుత హోదా: పత్తికొండ ఎమ్మెల్యే
విద్యార్హత: బీఏ
పుట్టిన తేది: 12.6.1972
సామాజిక వర్గం: రెడ్డి
నియోజకవర్గం: పత్తికొండ





పూర్తి పేరు: యల్లారెడ్డి గారి బాలనాగిరెడ్డి
ప్రస్తుత హోదా: మంత్రాలయం శాసనసభ్యులు
విద్యార్హత: ఇంటర్మీడియట్
పుట్టిన తేది: 23.07.1971
సామాజిక వర్గం: రెడ్డి
నియోజకవర్గం: మంత్రాలయం

నంద్యాల జిల్లా అభ్యర్థులు



పూర్తి పేరు: బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
ప్రస్తుత హోదా: రాష్ట్ర ఆర్థిక శాఖ **మంత్రి**
విద్యార్హత: బీటెక్
పుట్టిన తేది: 27.09.1970
సామాజిక వర్గం: రెడ్డి
నియోజకవర్గం: డోన్



పూర్తి పేరు: సింగారెడ్డి రవిచంద్రకిశోర్‌రెడ్డి
ప్రస్తుత హోదా: నంద్యాల శాసనసభ్యులు
విద్యార్హత: పీజీ డిప్లొమా (బిజినెస్ మేనేజ్‌మెంట్)
పుట్టిన తేది: 18.09.1983 సామాజిక వర్గం: రెడ్డి
నియోజకవర్గం: నంద్యాల



పూర్తి పేరు: పోచా బ్రహ్మానందరెడ్డి
ప్రస్తుత హోదా: నంద్యాల పార్లమెంట్ సభ్యులు
విద్యార్హత: ఎమ్మెస్సీ అగ్రికల్చర్
పుట్టిన తేది: 01.01.1954
సామాజిక వర్గం: రెడ్డి
పార్లమెంట్ నియోజకవర్గం: నంద్యాల



పూర్తి పేరు: కాటసాని రామిరెడ్డి
ప్రస్తుత హోదా: బనగానపల్లె శాసనసభ్యులు
విద్యార్హత: బీఏ
పుట్టిన తేది: 18.8.1966
సామాజిక వర్గం: రెడ్డి
నియోజకవర్గం: బనగానపల్లె



పూర్తి పేరు: సింగారెడ్డి చక్రపాణి రెడ్డి (శిల్పా రవిచక్రపాణిరెడ్డి)
ప్రస్తుత హోదా: శ్రీశైలం శాసనసభ్యులు
విద్యార్హత: ఇంటర్మీడియెట్
పుట్టిన తేది: 1.7.1963 సామాజిక వర్గం: రెడ్డి
నియోజకవర్గం: శ్రీశైలం



పూర్తి పేరు: గంగుల బిజేంద్రారెడ్డి
ప్రస్తుత హోదా: ఆళ్లగడ్డ శాసనసభ్యులు
విద్యార్హత: బి.కాం
పుట్టిన తేది: 23.08.1988
సామాజిక వర్గం: రెడ్డి
నియోజకవర్గం: ఆళ్లగడ్డ

పూర్తి పేరు: డాక్టర్ దారా సుధీర్
ప్రస్తుత హోదా: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్
విద్యార్హత: ఎంబీబీఎస్, ఎండీ (పెయిన్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్)
పుట్టిన తేది: 29.1.1973
సామాజిక వర్గం: ఎస్సీ(మాల)
నియోజకవర్గం: నందికొట్కూరు





పూర్తి పేరు: కాటసాని రాంభూపాల్‌రెడ్డి
ప్రస్తుత హోదా: పాణ్యం ఎమ్మెల్యే
విద్యార్హత: బీఏ
పుట్టిన తేది: 27.12.1959
సామాజిక వర్గం: రెడ్డి
నియోజకవర్గం: పాణ్యం

ఎన్నికల వేడి!

మోగిన సార్వత్రిక నగారా

- అమలులోకి వచ్చిన కోడ్
- కర్నూలు, నంద్యాల పార్లమెంట్‌తో పాటు 14 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు
- ఎన్నికలకు 57 రోజుల గడువు
- తడిసి మోపెడు కానున్న ఖర్చు



సాక్షి ప్రతినిధి, కర్నూలు: సార్వత్రిక సమరానికి కేంద్ర ఎన్నికల సంఘం పచ్చజెండా ఊపింది. పార్లమెంట్ ఎన్నికలతో పాటు నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. నాలుగో విడతలో ఉమ్మడి జిల్లాలోని 2 పార్లమెంట్ స్థానాలతో పాటు 14 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. షెడ్యూలు వెలువడటంతో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ శుక్రవారం సాయంత్రమే అమలులోకి వచ్చింది. దీంతో ఎలాంటి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు నిర్వహించరాదు. కోడ్ ఉల్లంఘిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం శిక్షార్హులవుతారు. వారిపై అనర్హత వేటు వేసే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా 7 విడతల్లో జరగనున్న ఎన్నికల్లో నాలుగో విడతలో ఏపీ పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికలకు దాదాపు రెండు నెలల(57 రోజులు) గడువు ఉండగా.. ఎండ వేడిమితో పాటు రాజకీయం వేడెక్కడంతో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ఎన్నికల కోడ్ అమలులోకి..

శుక్రవారం సాయత్రం 3గంటల నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది.

- రాజకీయ పార్టీల నేతలకు సంబంధించిన విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు వారికి సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించనున్నారు.
- ఎన్నికల బరిలో నిలిచే ప్రజాప్రతినిధులు ఎలాంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనకూడదు.
- ఎన్నికల ప్రచారం నిర్వహించే అభ్యర్థులు రాత్రి 10 గంటలకే మైకులు బంద్ చేయాలి.
- ఉదయం 6గంటల వరకూ మైకుల్లో ఎలాంటి ప్రచారం చేయకూడదు.
- దీన్ని అతిక్రమించినా కోడ్ ఉల్లంఘన కిందకు వస్తారు.
- అలాగే అభ్యర్థులు టీవీ, పత్రికలకు వచ్చే యాడ్స్‌తో పాటు ఈ సారి సోషల్ మీడియాలోని ప్రకటనలు కూడా ఎన్నికల వ్యయం కింద పరిగణించనున్నారు.
- అభ్యర్థులు ఎన్నికల అఫిడవిట్‌లో సోషల్ మీడియా అకౌంట్లు కూడా పొందుపరచాలి.

ఎన్నికలు జరిగే పార్లమెంట్ స్థానాలు	: 02
అసెంబ్లీ స్థానాలు	: 14
నామినేషన్ల స్వీకరణ	: ఏప్రిల్ 18
నామినేషన్ల దాఖలుకు ఆఖరు తేది	: ఏప్రిల్ 25
నామినేషన్ల పరిశీలన	: ఏప్రిల్ 26
నామినేషన్ల ఉపసంహరణ	: ఏప్రిల్ 29 వరకు
పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్	: మే 13
ఎన్నికల ఫలితాల వెల్లడి	: జూన్ 4

ఎన్నికలకు 57 రోజుల గడువు

గత సార్వత్రిక ఎన్నికల్లో తొలి విడతలోనే ఎన్నికలు జరిగాయి. షెడ్యూల్ వెలువడిన నెలకే పోలింగ్ ముగిసింది. అయితే ఈ దఫా 57 రోజుల గడువుంది. దీంతో అభ్యర్థులు ప్రచారానికి, ఎన్నికలకు సిద్ధం కావడానికి ఎక్కువ సమయం ఉంది. ఎన్నికల ప్రచారంలో ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు సుదీర్ఘంగా శ్రమించక తప్పని పరిస్థితి. మరోవైపు పార్టీ కార్యకర్తలను రెండు నెలల పాటు మచ్చిక చేసుకుని ఎన్నికలు చేసుకునేందుకు అభ్యర్థులకు ఖర్చు కూడా తడిసిమోపెడు కానుంది. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే అభ్యర్థులను పూర్తిగా ప్రకటించింది. టీడీపీ 12 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. జనసేన, బీజేపీ కూటమితో కలిసి ఎన్నికలకు రావడంతో ఆదోని, ఆలూరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. అలాగే ఎంపీ అభ్యర్థులను కూడా ప్రకటించలేదు. వైఎస్సార్‌సీపీ, కూటమి అభ్యర్థులు ఇప్పటికే ప్రచారాన్ని వేగవంతం చేశారు.

వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్యే పోటీ

ఉమ్మడి జిల్లాలో కర్నూలు, నంద్యాలతో పాటు 14 అసెంబ్లీ స్థానాలలో వైఎస్సార్‌సీపీ ఒంటరిగా బరిలోకి దిగనుంది. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా బరిలోకి దిగనున్నాయి. అలాగే కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం కూడా పొత్తు కట్టి బరిలో నిలవనున్నాయి. వీటితో పాటు లోక్‌సత్తా, బీఎస్పీ లాంటి పార్టీలు కూడా పోటీలో ఉండనున్నాయి. అయితే పోటీ మాత్రం వైఎస్సార్‌సీపీ, కూటమి మధ్యే ప్రధానంగా ఉండనుంది.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం

- పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ సృజన

కర్నూలు(అర్బన్): ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. శనివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక చిల్డ్రన్స్ పార్కులోని ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేయడం వల్లే 1956 నవంబర్ 1వ తేదీన ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. మహాత్మాగాంధీ ఆశయాల కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అమరజీవి అని కొనియాడారు. కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ, చిల్డ్రన్స్ పార్క్ ఎండీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు



ఉపకరణాలను అందజేస్తున్న జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): సామాజిక సేవలో భాగంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ విభిన్న ప్రతిభావంతులకు అండగా నిలిచింది. రూ. 21.55 లక్షలు విలువ చేసే సహాయ ఉపకరణాలను అందజేసింది. కర్నూలు నగరంలోని బీక్యాంపు మన వృద్ధుల ఆశ్రమం ఈ కార్యక్రమానికి వేదికైంది. బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిళ్లు, హియరింగ్ పాడ్స్, కృత్రిమ చెవి మిషన్లు, చేతికర్రలు, వీల్ చైర్లను శనివారం జేసీ నారపురెడ్డి మౌర్యతో అందజేయించారు. కార్యక్రమంలో ఐఓసీఎల్ ఈడీ డీఎస్ రావు, సీజీఎం డీపీ శతపతి పాల్గొన్నారు.

జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిగా భూపతిరావు



కర్నూలు (టౌన్): జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిగా భూపతిరావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం సాయంత్రం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంచాలకులు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. భూపతిరావు ఖో-ఖో, కబడ్డీ కోచ్‌గా పనిచేస్తున్నాడు. గతంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిగా పనిచేశాడు. కాగా.. ఇక్కడ పనిచేస్తున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ఒంగోలుకు బదిలీ అయ్యారు.

వేసవి స్కేటింగ్ శిక్షణ శిబిరం ఏర్పాటు

కర్నూలు స్పోర్ట్స్ ఔట్‌డోర్ స్టేడియంలో స్కేటింగ్ రింక్‌లో వేసవి స్కేటింగ్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు స్కేటింగ్ కార్యదర్శి బైరెడ్డి ఫక్కీ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 సంవత్సరాలు పైబడిన చిన్నారులు ఈ శిక్షణకు అర్హులని, వివరాలకు 9010501082 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వైభవం.. రాఘవేంద్రుల జయంత్యుత్సవం

- టీటీడీ అధికారుల పట్టువస్త్రాల సమర్పణ
- కనుల పండువగా నవరత్న రథోత్సవం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి జయంత్యుత్సవాన్ని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో శనివారం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ముందుగా రాఘవేంద్రుల మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఏఈఓ వీరబ్రహ్మం పట్టువస్త్రాలను ఊరేగింపుగా శ్రీమఠానికి తీసుకొచ్చారు. శ్రీమఠం ఏఏఓ మాధవ శెట్టి ఆధ్వర్యంలో టీటీడీ అధికారులకు మఠం మర్యాదలతో ఆహ్వానం పలికారు. శ్రీమఠం ప్రాంగణంలో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు పూలమాల సమర్పించి సాదర స్వాగతం పలికారు. రాఘవేంద్రుల మూల బృందావనంతో శ్రీవారి వస్త్రాలకు విశిష్ట పూజలు నిర్వహించారు. ఊంజల మంటపం ఎదుట తమిళనాడుకు చెందిన కళాకారులు నిర్వహించిన నాదహారం కార్యక్రమం వీనుల విందు చేసింది. రాఘవేంద్ర స్వామి భక్తుడు శ్రీనివాసమూర్తి మూలరాములకు వైజయంతి వనమాలను విరాళంగా అందజేశారు. అనంతరం నవరత్న రథంపై రాఘవేంద్రులను వైభవోపేతంగా ఊరేగించారు. వేడుకలను పురస్కరించుకుని కన్నడ సినినటుడు జగ్గేష్ రాఘవేంద్రులను దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏపీ హైకోర్టు జడ్జి హరినాథ్ నూనెపల్లి, అదనపు సొలిసిటర్ శాంతిభూషణ్, ఆర్‌అండ్‌బీ సెక్రటరీ ప్రద్యుమ్న, బెంగళూరు సీనియర్ అడ్వకేట్ ఎస్‌పి శంకర్, రాయచూరు అడ్వకేట్ పురోహిత్, చెన్నై పారిశ్రామికవేత్త ప్రమోద్‌లకు రాఘవేంద్రుల అవార్డులను ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకలో పండిత కేసరి గిరియాచార్, మేనేజర్లు మాధవ శెట్టి, వెంకటేష్ జోషి, ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.



అశేష భక్తజనం మధ్య సాగుతున్న నవరత్న రథోత్సవం



వైజయంతి వనమాలతో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు



నాదహారం చేస్తున్న తమిళనాడు భక్తులు



హదీస్ వెలుగు :

అల్లాహ్ అనంత కరుణామయుడు. అపర కృపాశీలుడు. చేసిన పాపాల నుంచి ముక్తి కోసం, కరుణ కోసం నిత్యం దువా చేస్తూ ఉండండి.

– పవిత్ర ఖురాన్

పీజీ పరీక్షలకు 47 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదటి సెమిస్టర్ పరీక్షలకు శనివారం 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీతో పాటు నందికొట్కూరు, నంద్యాల, ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఆదోని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం నిర్వహించిన పరీక్షలకు 547 మంది విద్యార్థులకు 500 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయండి

- మార్కెట్‌శాఖ జేడీ రామాంజనేయులు

ఆదోనిఅర్బన్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతి మార్కెట్‌యార్డుకు ఇచ్చిన లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని మార్కెట్‌శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు అధికారులకు సూచించారు. శనివారం స్థానిక మార్కెట్‌యార్డు కార్యాలయంలో ఉమ్మడి కర్నూలు జిల్లా మార్కెట్‌యార్డు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 94 శాతం లక్ష్యం పూర్తి అయ్యిందని, ఇంకా 6 శాతం ఈనెల 31వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచాలని, సెస్ తదితర వాటిని త్వరితగతిన వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఏడీఏ నారాయణమూర్తి, సెక్రటరీలు రామ్మోహన్‌రెడ్డి, గోవింద్, పద్మావతి, శేషిరెడ్డి, డీఈఈ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేస్తాం

- ఫిర్యాదులు, సలహాల కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- విలేకరుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్, జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో 2,186 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అక్సిలరీ కేంద్రాలు 18 కలుపుకొని మొత్తం 2,204 కేంద్రాలు ఉన్నట్లు చెప్పారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి 213 మంది సెక్టార్ ఆఫీసర్లు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్(ఎంసీసీ) బృందాలు 35, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు 64, స్టాటిస్టికల్ సర్వేలైన్స్ టీమ్‌లు 78, వీఎస్‌టీ 11, వీవీటీ 10, అకౌంటింగ్ 9, అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ బృందాలు 12 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధుల కోసం 15,869 మంది తీసుకోవడానికి ఎన్నికల కమిషన్ అనుమతి కోసం నివేదించామని పేర్కొన్నారు. మోడల్ కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు మండల, నియోజకవర్గాల వారీగా కమిటీలను నియమించామన్నారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇందులో ఒక సీనియర్ అధికారి అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఫిర్యాదులు, సలహాలు, సూచనలను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రభావాన్ని తగ్గించేందుకు ఏదైనా సమాచారం ఉంటే 1950, 180004257755, 08518220125 నంబర్లకు ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు. లేదంటే mcczppkurnool@gmail. com, cmcknl2024 @gmail. com వివరాలను పంపవచ్చని, పంపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం

జిల్లాలో మొత్తం 20,30,377 మంది ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 10,01,971, స్త్రీలు10,28,096, ఇతరులు 310 మంది ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో సర్వీసు ఓటర్లు 1,609 మంది, 18–19 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లు 49,103 మంది, 85 ఏళ్ల కంటే అధికంగా వయసు ఉన్న ఓటర్లు 10,005, పీడబ్ల్యూడీ ఓటర్లు 23,827 మంది ఉన్నారన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా ఓటర్లు ఉన్న జిల్లాగా కర్నూలు నిలిచిందన్నారు. 2019 ఎన్నికల్లో జిల్లాలో 76 శాతం ఓటింగ్ నమోదు అయిందని, దానిని ఈసారి 86 శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఓటరు జాబితాలో పేరు లేనివారు నామినేషన్ల విత్ డ్రా రోజు అంటే ఏప్రిల్ 29వ తేదీ వరకు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అయితే ఓటరును తొలగించడానికి మాత్రం దరఖాస్తులు తీసుకోబోమని స్పష్టం చేశారు.

ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ.. సమస్యాత్మ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 11 వేల మద్యం, రూ.5 కోట్లకుపైగా డబ్బులను స్వాధీనం చేసుకున్నామన్నారు. అంతేకాక మూడు వేల మందిపై బైండోవర్ కేసులు పెట్టినట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో జేసీ నారపురెడ్డి మౌర్య పాల్గొన్నారు.

వీఏఏల అంతర్ జిల్లా బదిలీలు

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామ వ్యవసాయ సహాయకుల (వీఏఏ) అంతర్ జిల్లా బదిలీలు పూర్తయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 11 మంది ఇతర జిల్లాలకు బదిలీ కాగా... ఇత ర జిల్లాల నుంచి 11 మంది ఉమ్మడి కర్నూలు జిల్లాకు వస్తున్నారు. కేవలం స్పౌజ్, మ్యూచువ ల్ బదిలీలకు వ్యవసాయ శాఖ వీఏఏలకు అవకాశం కల్పించింది. వైఎస్‌ఆర్ జిల్లా నుంచి ము గ్గురు, అనంతపురం జిల్లా నుంచి నలుగురు, తూర్పుగోదావరి,గుంటూరు, ప్రకారం జిల్లాల నుంచి ఒక్కొక్కరు ప్రకారం జిల్లాకు వస్తున్నా రు. నలుగురు స్పౌజ్, ఏడు గురు మ్యూచువల్ పై ఆయా జిల్లాల నుంచి ఇక్కడికి వస్తున్నారని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

మెరిట్ లిస్ట్ విడుదల

కర్నూలు(హాస్పిటల్): నూతనంగా ఏర్పాటైన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పోస్టులను భర్తీ చేసేందుకు మొత్తం 14 కేటగిరీల్లో మూడు కేటగిరీల అభ్యర్థుల ఫైనల్ మెరిట్, సెలెక్షన్ లిస్ట్ విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినర్సమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాను కర్నూ లు,నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్లు https:// kurnool. ap. gov. in, https:// nandyal. ap.gov.in, https:// kurnoolmedi calcollege. ac. inలలో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక సెట్ నకలు సర్టిఫికెట్స్‌తో ఈ నెల 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు హాజ రుకావాలని తెలిపారు. అలా హాజరుకాని అభ్యర్థుల ఎంపిక రద్దు చేస్తామని పేర్కొన్నారు.

కర్నూలులో పైలట్ శిక్షణకు అనుమతి

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో పైలట్ శిక్షణ ప్రారంభించేందుకు అనుమతి లభించినట్లు ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ చైర్మన్ ఆనంద్ జాకబ్ వర్గీస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ సంస్థకు పైలట్ శిక్షణ టెండర్ దక్కడం సంతోషంగా ఉందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులకు త్వరలోనే పైలట్ శిక్షణను స్కాలర్‌షిప్పు ఇచ్చి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. యువతను ఈ రంగంలోకి ప్రవేశించేలా ప్రోత్సహించడంతోపాటు దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన రంగం ప్రయోజనాలను ఎక్కువ మంది పొందేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర విభాగం కార్యదర్శిగా జిలాన్ బాషా

కర్నూలు (టౌన్): వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా జిలాన్ బాషా నియమితులయ్యారు. అలాగే పాణ్యం నియోజకవర్గానికి చెందిన షేక్ హఫీజ్ మహమ్మద్ ఇలియాస్‌ను పార్టీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షులుగా నియమించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరిరువురి నియామకాలు ఖరారు చేస్తూ శనివారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇద్దరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈలకు పదోన్నతి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు డీఈఈలకు ఈఈలుగా పదోన్నతి లభించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ కర్నూలు ఎస్‌ఈ బీ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో విధులు నిర్వహిస్తున్న కే మురళీధర్‌రావును ప్రకాశం జిల్లా పొదిలికి ఈఈగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారన్నారు. అలాగే జిల్లాలోని కోడుమూరులో డీఈఈగా పనిచేస్తున్న కే ఏడుకొండలును వైఎస్సార్ కడపకు ఈఈగా పదోన్నతిపై బదిలీ చేశారన్నారు. జీఓ నెంబర్: 233 మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల ఈ నెల 15వ తేదీన అర్హులైన డీఈఈలకు ఈఈలుగా పదోన్నతి కల్పిస్తూ పీఆర్‌అండ్‌ఆర్‌డీ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

కేఎంసీ ప్రిన్సిపాల్‌కు పదోన్నతి

కర్నూలు (హాస్పిటల్) : కర్నూలు మెడికల్ కళాశాల (కేఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నర్సమ్మకు పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు సీనియర్ ప్రొఫెసర్లకు అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా పదోన్నతులు కల్పించారు. అందులో భాగంగా కర్నూలు మెడికల్ కళాశాలలో సీనియర్ ప్రొఫెసర్ అయిన డాక్టర్ చిట్టి నర్సమ్మకు అడిషనల్ డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా పదోన్నతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

'పది' పరీక్షల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

కర్నూలు (సిటీ): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 18వ తేదీ నుంచి మొదలుకానున్నాయని, పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని కస్టోడియన్స్‌ను డీఈఓ శామ్యూల్ ఆదేశించారు. శనివారం కస్టోడియన్స్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్షలు నిర్వహించేలా కస్టోడియన్స్ చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల్లో మాల్ ప్రాక్టీస్ జరిగితే సంబంధిత ఇన్విజిలేటర్‌పై చర్యలు ఉంటాయన్నారు. కర్నూలు డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ భూషణరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1,219 కేసుల పరిష్కారం

కర్నూలు(లీగల్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,219 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్‌వీఎన్ శ్రీనివాసరావు తెలిపారు. కర్నూలులో అత్యధికంగా 534 కేసులు, నంద్యాలలో 176, డోన్‌లో 151 కేసులు, ఆదోనిలో 83, ఆళ్లగడ్డలో 44, ఆలూరులో 31, ఆత్మకూరులో 32, బనగానపల్లెలో 28, కోవెలకుంట్లలో 32, నందికొట్కూరులో 44, పత్తికొండలో 19, ఎమ్మిగనూరులో 45 కేసులను పరిష్కరించామన్నారు. కర్నూలులో రిటైర్డ్ జిల్లా జడ్జి నరసింహారెడ్డి 50 రోడ్డు ప్రమాద కేసులు పరిష్కారం చేసి బాధితులకు రూ.4.50 కోట్లు ఇప్పించారన్నారు. జిల్లా కోర్టులోని అప్పీళ్లను ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి పి.పాండురంగారెడ్డి పరిష్కారం చేయగా.. సబ్ కోర్టు స్థాయిలో కేసులను అదనపు సీనియర్ సివిల్ జడ్జి దివాకర్ పరిష్కరించినట్లు చెప్పారు. జూనియర్ సివిల్ జడ్జిలు టి.జ్యోత్స్న దేవి, ఎల్.వందనలు లోక్ అదాలత్‌లో పాల్గొంచుకున్నారన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు, ఇన్సూరెన్స్ అధికారులు, నగరపాలక సంస్థ అధికారులు, పోలీసులు పాల్గొని విజయవంతం చేసినట్లు వెల్లడించారు.



కేసు విచారణలో న్యాయమూర్తులు నరసింహారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు